# పాత దానిలోనుండి క్రొత్త దానికి: నిబంధనలో మార్పు

> -ఇదిగో నేను ఇశ్రాయేలువారితోను యూదావారితోను క్రొత్త నిబంధన చేయు దినములు వచ్చుచున్నవి; ఇదే యెహోవా వాక్కు. అది ఐగుప్తులోనుండి వారిని రప్పించుటకై నేను వారిని చెయ్యి పట్టుకొనిన దినమున, వారి పితరులతో నేను చేసిన నిబంధనవంటిది కాదు (యిర్మీయా 31:31, 32ఎ).

బైబిలులోని గొప్ప నిబంధన క్రొత్త నిబంధన. అది సంకల్పించబడి, వాగ్దానం చేయబడి, ప్రవచింపబడి, యిప్పుడు ప్రకటింపబడినదై అర్పణం చేయబడియుంది. పాత నిబంధనలో క్రొత్త నిబంధనను గూర్చిన ప్రవచనాలు కన్పిస్తాయి, వీటిలో ఎక్కువ సంపూర్ణమైనది యిర్మీయా 31:31–34లో ఉంది.

ఇతర లేఖన భాగాల్లో కూడా క్రొత్త నిబంధనను గూర్చిన ప్రతిపాదనలున్నాయి. ఉదాహరణకు, యెషయా 55:3 యిలా అంటుంది,

> చెవియొగ్గి నాయొద్దకు రండి
> మీరు వినినయెడల మీరు బ్రదుకుదురు
> నేను మీతో నిత్యనిబంధన చేసెదను
> దావీదునకు చూపిన శాశ్వతకృపను మీకు చూపుదును.

అపొ. 13:34లో పౌలు ఈ లేఖన భాగాన్ని ప్రభువైన యేసుకు వర్తింపజేశాడు. క్రొత్త నిబంధనకు అంటే నిత్యమైన నిబంధనకు సంబంధించిన (హెబ్రీ. 13:20) మరికొన్ని లేఖన భాగాలు యిక్కడ యివ్వబడ్డాయి.

> నేను వారికి మేలు చేయుట మానకుండునట్లు నిత్యమైన నిబంధనను వారితో చేయుచున్నాను; వారు నన్ను విడువకుండునట్లు వారి హృదయములలో నా యెడల భయభక్తులు పుట్టించెదను (యిర్మీయా 32:40; 50:5 కూడా చూడు).

> నేను వారితో సమాధానార్థమైన నిబంధన చేసెదను, అది నాకును వారికిని నిత్య నిబంధనగా ఉండును, నేను వారిని స్థిరపరచెదను, వారిని విస్తరింపజేసి వారి మధ్య నా పరిశుద్ధ స్థలమును నిత్యము ఉంచెదను (యెహెజ్కేలు 37:26; 16:60–62 కూడా చూడు).

> అతడు ఒక వారమువరకు అనేకులకు నిబంధనను స్థిరపరచును (దానియేలు 9:27ఎ).

ఇదిగో నాకు ముందుగా మార్గము సిద్ధపరచుటకై నేను నా దూతను పంపుచున్నాను; మీరు వెదకుచున్న ప్రభువు, అనగా మీరు కోరు నిబంధన దూత, తన ఆలయమునకు హఠాత్తుగా వచ్చును; ఇదిగో ఆయన వచ్చుచున్నాడని సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు (మలాకీ 3:1).

## పాత నిబంధన అలక్ష్యం చేయబడింది

ఇశ్రాయేలు దేశం క్షీణిస్తున్న సంవత్సరాలలో యిర్మీయా ప్రవచించాడు. తిరుగుడు జాతిగా ఉన్న అబ్రాహాము, ఇస్సాకు, యాకోబుల సంతతివారు ఐగుప్తుగుండా కనానుకు వచ్చి, అక్కడ గొప్ప దేశంగా స్థిరపడ్డారు. న్యాయాధిపతుల కాలంలో, ఇశ్రాయేలీయులు దేవుని యొద్దనుండి తిరిగి పోయి ధర్మశాస్త్ర ప్రకారం జీవించడం మానారు. దానికి బదులు, "ప్రతివాడును తన తన ఇష్టానుసారముగా ప్రవర్తించుచువచ్చెను" (న్యాయాధి. 17:6బి). "నేడు మనమిక్కడ చేయుచున్నట్లు మీలో ప్రతి మనుష్యుడు తన కంటికి యుక్తమైన దంతయు చేయకూడదు" అని మోషే ద్వారా దేవుడు హెచ్చరిక చేసినా (ద్వితీయో. 12:8), అది సంభవించింది.

యెహోషువచేత నడిపింపబడిన తరము గతించిపోయిన తరువాత (న్యాయాధి. 2:7 చూడు) పాప భరితులైన ఇశ్రాయేలు పట్ల దేవుని వైఖరి ఎలా ఉందో న్యాయాధిపతుల గ్రంథం వర్ణిస్తుంది.

యెహోవా వారితో చెప్పినట్లు, యెహోవా వారితో ప్రమాణము చేసినట్లు, వారు పోయిన ప్రతి స్థలమున వారికి బాధ కలుగజేయుటకు యెహోవా వారికి శత్రువాయెను గనుక వారికి మిక్కిలి యిబ్బంది కలిగెను.

ఆ కాలమున యెహోవా వారికొరకు న్యాయధిపతులను పుట్టించెను. వీరు దోచుకొనువారి చేతిలోనుండి ఇశ్రాయేలీయులను రక్షించిరి. అయితే వారు ఇంక న్యాయాధిపతుల మాట వినక తమ పితరులు యెహోవా ఆజ్ఞలను అనుసరించి నడిచిన మార్గమునుండి త్వరగా తొలగిపోయి యితర దేవతలతో వ్యభిచరించి వాటికి నమస్కరించిరి; తమ పితరులు ఆ ఆజ్ఞలను అనుసరించినట్లు వారు నడవకపోయిరి. తమ శత్రువులు తమ్మును బాధింపగా వారు విడిచిన నిట్టూర్పులు యెహోవా విని సంతాపించి వారికొరకు న్యాయాధిపతులను పుట్టించి, ఆయా న్యాయాధిపతులకు తోడైయుండి వారి దినములన్నిటను వారి శత్రువుల చేతులలోనుండి ఇశ్రాయేలీయులను రక్షించెను. ఒక్కొక్క న్యాయాధిపతి చనిపోగా వారు వెనుకకు తిరిగి యితర దేవతలను అనుసరించి పూజించుచు వాటికి సాగిలపడుచు ఉండుటవలన తమ క్రియలలోనేమి తమ మూర్ఖ ప్రవర్తనలోనేమి దేనిని విడువక తమ పూర్వికులకంటె మరి మిగుల చెడ్డవారైరి. కాబట్టి యెహోవా కోపాగ్ని ఇశ్రాయేలీయుల మీద నుండగా ఆయన ఈలాగు సెలవిచ్చెను – ఈ ప్రజలు నా మాట వినక, వీరి పితరులతో నేను చేసిన నిబంధనను మీరుదురు. గనుక నేను నియమించిన విధి ననుసరించి వారి పితరులు నడిచినట్లు వీరును యెహోవా విధి ననుసరించి నడుచుదురో లేదో ఆ జనములవలన ఇశ్రాయేలీయులను శోధించుటకై యెహోషువ చనిపోయిన కాలమున శేషించిన జనములలో ఏ జనమును వారియెదుటనుండి నేను వెళ్లగొట్టను (న్యాయాధి. 2:15–22).

బెన్యామీను గోత్రికుడైన సౌలు రాజుగా చేయబడడంతో న్యాయాధిపతుల కాలం

అంతరిస్తుంది. సౌలు యొక్క అవిధేయతవలన, దేవుడతనిని సింహాసనంనుండి తొలిగించి, దావీదును ఇశ్రాయేలీయుల మీద రాజుగా నియమించాడు. దావీదు కుమారుడైన సొలొమోను, ఇశ్రాయేలును దాని అత్యున్నత స్థితిలో ఏలాడు. అయితే అతడు తన అనేకమంది భార్యలవలన దేవునినుండి త్రిప్పివేయబడినవాడై విగ్రహారాధనకు మరలాడు. ఇందునుబట్టి సొలొమోను కుమారుడైన రెహబాముకు రెండు గోత్రాలనే ఏలడానికి మిగిల్చి, మిగిలిన పది గోత్రాలను ఆయన యరోబాముకు అప్పగించాడు (1 రాజులు 11:3, 4, 31). ఉత్తరముననున్న పది గోత్రాలవారు ఇశ్రాయేలు రాజ్యంగాను, యూదా బెన్యామీనులనే దక్షిణపు గోత్రాలవారు (లేవీయులతో కూడా కలిసిపోయి; 2 దినవృ. 11:14 చూడు) యూదా రాజ్యంగా మారిపోయారు.

అనేక రాజ వంశాల మార్పులతో, ఇశ్రాయేలు రాజ్యం చెడిపోయింది. యూదా రాజ్యం కొంత కాలం ఫరవాలేదన్నట్టు అనిపించింది. దానికి సంబంధించిన సంగ్రహ సమాచారం యిలా యివ్వబడింది:

> అయినను – మీ దుర్మార్గములను విడిచిపెట్టి, నేను మీ పితరులకు ఆజ్ఞాపించినట్టియు, నా సేవకులగు ప్రవక్తలద్వారా మీకప్పగించినట్టియు ధర్మశాస్త్రమునుబట్టి నా ఆజ్ఞలను కట్టడలను ఆచరించుడని సెలవిచ్చి, ప్రవక్తలందరి ద్వారాను దీర్ఘదర్శులద్వారాను యెహోవా ఇశ్రాయేలువారికిని యూదావారికిని సాక్ష్యము పలికించినను, వారు విననివారై తమ దేవుడైన యెహోవా దృష్టికి విశ్వాసఘాతుకులైన తమ పితరులు ముష్కరులైనట్టు తామును ముష్కరులైరి. వారు ఆయన కట్టడలను, తమ పితరులతో ఆయన చేసిన నిబంధనను, ఆయన తమకు నిర్ణయించిన ధర్మశాస్త్రమును విసర్జించి వ్యర్థమైనదాని అనుసరించుచు, వ్యర్థులై – వారి వాడుకల చొప్పున మీరు చేయ కూడదని యెహోవా తమకు సెలవిచ్చిన తమ చుట్టునున్న ఆ జనుల మర్యాదల ననుసరించి వారివంటివారైరి. వారు తమ దేవుడైన యెహోవా ఆజ్ఞలన్నిటిని అనుసరింపక పోత విగ్రహములైన రెండు దూడలను చేసి దేవతా స్తంభములను నిలిపి ఆకాశ సమూహమునకు నమస్కరించి – బయలు దేవతను పూజించిరి. మరియు తమ కుమారులను కుమార్తెలను అగ్ని గుండమును దాటించి శకునమును చిల్లంగితనమును వాడుక చేసికొని యెహోవా దృష్టికి చెడుతనము చేయుటకై తమ్మును తాము అమ్ముకొని, ఆయనకు కోపము పుట్టించిరి. కాబట్టి యెహోవా ఇశ్రాయేలు వారియందు బహుగా కోపగించి, తన సముఖములోనుండి వారిని వెళ్లగొట్టెను గనుక యూదా గోత్రము గాక మరి యే గోత్రమును శేషించి యుండలేదు (2 రాజులు 17:13–18).

యూదా కూడా చెడిపోవడానికి ఎక్కువ సంవత్సరాలు గడవలేదు. గనుక వారిని శిక్షించడానికి దేవుడు తీర్మానించుకున్నాడు. "కాబట్టి యెహోవా – 'నేను ఇశ్రాయేలు వారిని వెళ్లగొట్టినట్లు యూదావారిని నా సముఖమునకు దూరముగా చేసి, నేను కోరుకొనిన యెరూషలేము పట్టణమును, "నా నామమును అచ్చట ఉంచుదునని" నేను చెప్పియున్న మందిరమును నేను విసర్జించెదనని అనుకొనియుండెను' " (2 రాజులు 23:27).

## క్రొత్త నిబంధన ప్రవచింపబడింది

ఈ చారిత్రక సందర్భంలో తాను క్రొత్త నిబంధన చేస్తానని దేవుడు ప్రవచించేలా చేశాడు:

> –ఇదిగో నేను ఇశ్రాయేలువారితోను యూదావారితోను క్రొత్త నిబంధన చేయు దినములు వచ్చుచున్నవి; ఇదే యెహోవా వాక్కు. అది ఐగుప్తులోనుండి వారిని రప్పించుటకై నేను వారిని చెయ్యి పట్టుకొనిన దినమున, వారి పితరులతో నేను చేసిన నిబంధన వంటిది కాదు; నేను వారి పెనిమిటినైనను వారు ఆ నిబంధనను భంగము చేసికొనిరి; ఇదే యెహోవా వాక్కు. ఈ దినములైన తరువాత నేను ఇశ్రాయేలువారితోను యూదావారితోను చేయబోవు నిబంధన యిదే, వారి మనస్సులలో నా ధర్మవిధి ఉంచెదను, వారి హృదయము మీద దాని వ్రాసెదను; యెహోవా వాక్కు ఇదే. నేను వారికి దేవుడనై యుందును వారు నాకు జనులగుదురు; వారు మరి ఎన్నడును – యెహోవాను గూర్చి బోధనొందుదము అని తమ పొరుగువారికిగాని తమ సహోదరులకుగాని ఉపదేశము చేయరు; నేను వారి దోషములను క్షమించి వారి పాపములను ఇక నెన్నడును జ్ఞాపకము చేసికొనను గనుక అల్పులేమి ఘనులేమి అందరును నన్నెరుగుదురు; ఇదే యెహోవా వాక్కు (యిర్మీయా 31:31–34).

క్రొత్త నిబంధన ఇశ్రాయేలువారు యూదావారు భంగము చేసిన నిబంధన వంటిది కాదు. అంటే, ఆయన ఇశ్రాయేలును ఐగుప్తునుండి బయటికి రప్పించినప్పుడు వారితో చేసిన నిబంధన వంటిది కాదు. క్రొత్త నిబంధన దేవుని సంకల్పంలో భాగమైయున్నట్టు స్థాపించడానికి క్రొత్త నిబంధన లేఖకులు ఈ లేఖన భాగాన్ని కోట్ చేశారు (హెబ్రీ. 8:6–13).

యిర్మీయా ద్వారా దేవుడు బయలుపరచిన ఈ ప్రవచనం ఎంత ప్రాముఖ్యమయ్యిందంటే – అందులో చెప్పబడిందంతా జాగ్రత్తగా ఆలోచింపవలసి యుంటుంది.

1. *"క్రొత్త నిబంధన."* ఈ నిబంధన "క్రొత్తది" అని చెప్పడంలో అలాటిది యింతకు ముందెన్నడు జరుగలేదని తెలియవస్తుంది. ఇంకో నిబంధనను తిరిగి సరిదిద్దేలాంటిది కాదిది. గతంలో జరిగిన ఏ నిబంధనలన్నింటికంటె యిది వ్యత్యాసంగా ఉంటుంది.

2. *"చేయబోవు ... దినములు వచ్చుచున్నవి."* "చేయుదును" అని దేవుడు చెప్పాడంటే, గతంలో ఆయన అలాటిది చేయలేదని, భవిష్యత్తులోనే ఆయన దానిని చేయబోతున్నాడని తెలుస్తుంది. ఇవ్వబడినప్పుడు; అది కేవలం దేవుని ఉత్పత్తియై ఉంటుంది. ఆయన విధించిన షరత్తుల ప్రకారం అది జరుగుతోంది.

3. *"వారి పితరులతో నేను చేసిన నిబంధనవంటిది కాదు."* అది క్రొత్త నిబంధనయై యుండడంచేత, గతంలో దేవుడు చేసిన కొన్నిటికి భిన్నమైనదైయుంటుంది (నిర్గమ. 34:27, 28; ద్వితీయో. 4:14; 10:1–5).

ఇశ్రాయేలు పితరులను ఐగుప్తునుండి తోడుకొని వచ్చినప్పుడు చేసిన నిబంధన వంటిది యిది "కాదనడం"లో, దేవుడు దానిమీద నిలిపిన ప్రాముఖ్యతను ఆలోచింపవలసి యుంటుంది. ఈ నిబంధనను గూర్చి యింత ప్రత్యేకంగా చెప్పినట్టు తక్కిన నిబంధనలను గూర్చి ఎందుకు చెప్పలేదు? బహు విదితమైన హేతువేమంటే (గతపు) నిబంధనను బట్టి, దేవునితో తమకున్న బాంధవ్యం స్థిరమైనదని, ఇశ్రాయేలీయులు నమ్మారు. దానిమీద వారు ఆధారపడినవారై దేవుడు వారి దేవుడైనట్టునూ ఆయన వారితో ఉన్నట్టును ఆయన వారిని కాపాడువాడై యున్నట్టును వారు నమ్మారు. నిజానికి, వారు ఆ నిబంధనలో నిలిచియుంటే దేవుడు వారియెడల శ్రద్ధ చూపేవాడే – దాన్ని భంగం చేసికొంటే మాత్రం కాదు సుమీ!

నిబంధనయందు తమకున్న నమ్మిక అధికమైన సంగతి యుద్ధ భూమిలోనికి వారు నిబంధన మందసాన్ని తెచ్చినప్పుడు కన్పిస్తుంది (1 సమూ. 4:5). పోరాడి యుద్ధాన్ని జయించడానికి దేవునినుండి సహాయం యెహోవా నిబంధన మందసం యొక్క ఉనికి వారి మధ్య నుండడంవలన కలుగుతుందని ఇశ్రాయేలీయులు తలంచినట్టున్నారు.

4. *"వారు ఆ నిబంధనను భంగము చేసికొనిరి."* అది యివ్వబడిన నాటినుండి ఇశ్రాయేలీయులు అతిక్రమించి భంగం చేసిన నిబంధన పది ఆజ్ఞలు, మరియు నిబంధనలో భాగమైయున్న యితర చట్టాలకు సంబంధించిందే. దాన్ని గౌరవించి అనుసరించడంలో వారు తప్పిన సంగతి మాటి మాటికి ప్రస్తావించబడింది. తిరస్కారంతో దాన్ని వారు చూస్తారన్నట్టు ప్రవక్తలు ప్రకటించారు (ద్వితీయో. 31:20). పైగా, వారు దాన్ని భంగం చేశారని బైబిలు ప్రతిపాదనలు తెలిపాయి (లేవీయ. 26:15; యెషయా 24:5; 33:8; యిర్మీయా 11:10; యెహెజ్కేలు 16:59). మరియు దాన్ని వదలి వేశారని (ద్వితీయో. 29:25; 1 రాజులు 19:10, 14), అతిక్రమించారని (యెహోషువ 7:15; న్యాయాధి. 2:20; 2 రాజులు 18:12; యిర్మీయా 34:18; హోషేయ 8:1), తృణీకరించారని (2 రాజులు17:15), దాన్ని ఉల్లంఘించారని (కీర్తన. 55:20), దాన్ని అనుసరించలేదని (కీర్తన. 78:10), అపనమ్మకంగా ఉన్నారని (కీర్తన. 78:37), వ్యర్థపరచారని (యెహెజ్కేలు 44:7) లేఖనాలు తెలియజేశాయి. యిర్మీయా 31:32లో క్రొత్త నిబంధన, "నిత్యమైన నిబంధన" (హెబ్రీ. 13:20), ఇశ్రాయేలీయులు భంగం చేసిన నిబంధనవంటిదై యుండదని దేవుడు ప్రకటించాడు.

5. *"వారి హృదయముల మీద దాని వ్రాసెదను."* క్రొత్త నిబంధన హృదయాల మీద వ్రాయబడుతుందనే వాస్తవం చెప్పబడింది, కాని అది ఎలా జరుగుతుందో చెప్పబడలేదు. క్రొత్త నిబంధన ఉపదేశం ద్వారా పరిశుద్ధాత్మచే హృదయాల మీద వ్రాయబడుతుందో లేక వేరే విధంగా హృదయాల మీద వ్రాయబడుతుందో తెలుపబడలేదు.[1]

6. *"వారందరు నన్ను తెలిసికొందురు."* దేవుని గూర్చిన ఈ జ్ఞానం, ప్రతి వ్యక్తికి వ్యక్తిగతంగా దేవుని యొక్క స్వభావం బయలుపరచడం ద్వారా వచ్చేది కాదు. "వారందరు నన్ను తెలిసికొందురు" అని ఆగక, వారు ఏ మూలంగా ఆయన్ను తెలిసికొంటారో యిలా వివరించుకొంటూ వెళ్లాడు: "నేను వారి దోషములను క్షమించి వారి పాపములను ఇకనెన్నడు జ్ఞాపకము చేసికొనను గనుక." దేవుడు తన్ను తాను ఎలా తెలియజేసికొంటాడో వివరించడానికి "గనుక" అనే పదాన్ని ఉపయోగించాడు. తన కుమారుని లోకానికి అనుగ్రహించడంవలన, దేవుడు తన నిజమైన స్వభావాన్ని క్షమించే దేవుడుగా బయలు పరచుకొంటాడు. తండ్రి యొక్క పోలికగల క్రీస్తు ప్రభువు (కొలస్సీ. 1:15; హెబ్రీ. 1:2, 3), తండ్రి యొక్క స్వభావాన్ని మానవాళికి చూపుతాడు (యోహాను 12:45; 14:9).

## ముగింపు

క్రొత్త నిబంధనను గూర్చిన ప్రవచనాలు పాత నిబంధనయందు కన్పిస్తాయి, కాని క్రొత్త నిబంధన యొక్క షరత్తులు అక్కడ కన్పించవు. అవి క్రొత్త నిబంధనలోనే కన్పిస్తాయి. ఐగుప్తును విడిచివచ్చిన ఇశ్రాయేలీయులతో దేవుడు చేసిన పాత నిబంధన వంటిదిగా క్రొత్త నిబంధన ఉండదు. తాను చేయబోవు క్రొత్త నిబంధనను దేవుడు సంకల్పించాడు, దానికొరకు సిద్ధపరచాడు, ప్రవచింపజేశాడు.

---

సూచనలు

[1]32వ పేజీలో హృదయం అనేది సవిస్తరంగా చర్చించబడింది.

---

## దేవునిచే చేయబడిన నిబంధన

---

జలప్రళయం ముగిసినతోడనే, నోవహుతోను, నోవహు సంతతితోను (9 వ.) ప్రతి ప్రాణితోను (10 వ.) తన నిబంధనను స్థిరపరుస్తానని, ఆదికాండం 9లో దేవుడు ప్రకటించాడు. దేవుడు యిలా అన్నాడు: “నేను మీతో నా నిబంధన స్థిరపరచుదును; సమస్త శరీరులు ప్రవాహ జలములవలన ఇకను లయపరచబడరు; భూమిని నాశనము చేయుటకు ఇకను జల ప్రవాహము కలుగదని పలికెను” (11 వ.).

పైగా, ఆ నిబంధనను ముద్రించడానికి దేవుడు ఒక గురుతునిచ్చాడు: “నాకును మీకును మీతోకూడనున్న సమస్త జీవరాసులకును మధ్య నేను తరతరములకు ఏర్పరచుచున్న నిబంధనకు గురుతు ఇదే. మేఘములో నా ధనస్సును ఉంచితిని; అది నాకును భూమికిని మధ్య నిబంధనకు గురుతుగా నుండును” (12, 13 వ.). మేఘాలు భూమిని కప్పినప్పుడు ఆ ధనస్సు మేఘంలో ఉంటుందని దేవుడు వాగ్దానం చేశాడు. మనుష్యుల భావంలో ఆయన యిలా తెలిపాడు: “ఆ ధనస్సు మేఘములో ఉండును. నేను దాని చూచి దేవునికిని భూమిమీదనున్న సమస్త శరీరులలో ప్రాణముగల ప్రతి దానికిని మధ్యనున్న నిత్య నిబంధనను జ్ఞాపకము చేసికొందుననెను” (16 వ.).

ఈ నిబంధన నోవహుకు రెండు పక్షాల మధ్యనున్న ఒప్పందం మాత్రమే కాదు. ఈ నిబంధన షరత్తులు లేనిది, సార్వత్రికమైనది, దేవునివలన చేయబడినదై ఉంది.